ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణభాస్కర



## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 29-6-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

భగవంతుడు అంతటా ఉన్నాడు. మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి దేహబుద్ధి ఉన్నవారికి ఏదోస్థానం నిర్దేశించి చెప్పాలి కాబట్టి నీ హృదయంలో ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు గాని ఆయన హృదయంలో ఉన్నాడు బయటలేడు అనికాదు. భగవంతుడు లోపల ఉన్నాడు, బయటఉన్నాడు, అంతటా వ్యాపించి ఉన్నాడు. ఈలోపల, బయట అనే బుద్ధి అజ్ఞానికిగాని జ్ఞానికి ఏమీ ఉండదు. దేహబుద్ధి ఉన్నవాడికే లోపల బయటగాని దేహబుద్ధి లేనివాడికి లోపలలేదు, బయటలేదు. మీరు పెద్దపెద్ద తపస్సులు చేయనక్కరలేదు. మీమనస్సు, మాట, చేత ఒకేలాగ ఉంటే మీకు అనేక సిద్ధులు కలుగుతాయి. కపటంలేకుండా మనస్సుకు అనుగుణమైన మాట, మాటకు అనుగుణమైన చేత ఉంటే ఆమనిషికి అనేక రకముల సిద్ధులు కలుగుతాయి, అనేకమందికి శాంతిని, సుఖాన్ని ఇవ్వగలరు.

జ్ఞానం సంపాదించటం కష్టం అని చాలామంది అనుకొంటూ ఉంటారు. చెప్పేవారుకూడా అలాగే చెపుతూఉంటారు. అందరికీధనం ఉంటుందా ? అందరికీ చదువు ఉంటుందా ? ఉండదు. జ్ఞానానికి చదువుకు సంబంధంలేదు. జ్ఞానానికి డబ్బుకు సంబంధంలేదు. నాకు ధనంలేదు కదా జ్ఞానంరాదు, నాకు చదువులేదుకదా జ్ఞానంరాదు అని ఇటువంటి భ్రాంతిలో పడవద్దు. నీహృదయంలో ఉన్నవస్తువు నీకు తెలియకపోవటానికి కారణం నీకు చదువు లేకపోవటంకాదు, నీకు ధనం లేకపోవటంకాదు. దానికి నీ బంధువులు కారణంకాదు. నీ అహంకారమే కారణం. ఇది జ్ఞాపకం ఉంచుకోండి. నీ అహంకారం కారణంగానే నీ హృదయంలో ఉన్న అనంతమైన వస్తువు నీకు అందటంలేదు. చాలమందికి చావు అంటే భయం. కొంతమందికి ప్రతీ చిన్న విషయానికి భయం కలుగుతూ ఉంటుంది. భయంవలన దుఃఖం వస్తుంది. దేహంతో సంబంధం లేకుండా చావులేని వస్తువు ఒకటి నీహృదయంలో ఉంది. అది కొన్ని క్షణాలు నీకు స్ఫురిస్తే ముందు చావు అంటే భయం, బాహ్యకారణాల వలన వచ్చే ఏరకమైన భయం అయినా నశిస్తుంది. రాగద్వేషాలు, జననమరణాలు ఇవి అన్నీ అహంకారానికేగాని లోపల ఉన్న సద్వస్తువుకు ఏమీ సంబంధం లేదు. లోపల ఉన్న సద్వస్తువు ఏకంగా ఉంటుంది.

భగవాన్ టీచింగ్ చాలా అద్భుతంగా ఉంటుంది. నిప్పుమీద నీరు పోసాము అనుకోండి అది వెంటనే ఆరిపోతుంది. అలాగే భగవాన్ టీచింగ్ వలన వెంటనే రిజల్ట్ వచ్చేస్తుంది, వాయిదాలు సమస్యలేదు. భగవాన్ దగ్గరకు ఒకరు వచ్చి నేను దొంగతనం చేసాను. దొంగతనం చేసాను అని జ్ఞాపకం వచ్చినప్పడల్లా దుఃఖం వస్తోంది అని చెప్పారు. మామూలువారు అయితే దొంగతనం చేసాను అంటున్నావుకదా ఆనదులలో మునగండి, గుడుల చుట్టూ తిరగండి, ఆదేవునికి నమస్కారం చేయండి అది పోతుంది అని ఇలా చెపుతూ ఉంటారు. కాని భగవాన్ చెప్పిన సమాధానం చూడండి. ఆయన

సమాధానంలో ఉన్న ప్రత్యేకత చూడండి. నువ్వు ఎవరు? చైతన్యము. చైతన్యము ఎప్పుడూ దొంగతనం చేయదు. నీవు దొంగతనం చేసాను అంటున్నావు. చేసాను అనే తలంపు వదిలివేస్తే ఏమీలేదు అన్నారు. ఆ తలంపే నిన్ను బాధిస్తోంది. ఆ తలంపు వదిలివేస్తే. ఇప్పుడే నీకు ఆనందం అందుతుంది. ఆతలంపే నీహృదయంలో ఉన్న శాంతి నీకు అందకుండా అడ్డువస్తోంది. ఆ తలంపు వదిలివేస్తే నీ హృదయంలో ఉన్న శాంతి నీకు అందుతుంది.

మనిషి పుట్టినది మొదలు చనిపోయేవరకూ అన్నీ తలంపులే, మీకు ఇష్టమయిన తలంపు వచ్చినపుడు సంతోషంవస్తుంది, ఇష్టంలేని తలంపు వచ్చినపుడు దుఃఖం వస్తుంది. అదీవస్తుంది, ఇదీ వస్తుంది, అదితలంపే, ఇదీ తలంపే. ఇవి నిజంకాదు ఇష్టంఅయిన తలంపువచ్చిన, ఇష్టంలేని తలంపువచ్చిన నేను అనేమొదటి తలంపుకే వస్తున్నాయి. ఈ రెండింటికి ఆదారముగా ఉన్న ఆ నేను అనే తలంపు ఎవరు అని డైరెక్టుగా విచారణలో పెట్టకపోతే కోటిజన్మలు ఎత్తినా నీకు జ్ఞానంరాదు. నీహృదయంలో ఉన్న అమృతస్థితి నీచేతికి అందకుండా ఈ నేను అనే మొదటి తలంపే అడ్డువస్తోంది. అది నీవు గుర్తించాలి. ఈ నేను అనే మొదటి తలంపును పట్టుకోకుండా అది సృష్టించిన గొడవలలో పడిపోతే నీకు జ్ఞానవచ్చే సమస్యలేదు. నీవు ఏ మార్గంలో ప్రయాణంచేసినా, ఏ గురువును ఆశ్రయించినా నీవు పొగొట్టుకోవలసింది దేహగతమైన నేనునే. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా నీ ఉనికిని ఏ నేను అయితే పరిమితం చేస్తోందో ఆ నేనును పోగొట్టుకోకపోతే నీకు మోక్షంలేదు, పరమస్థితిని పొందలేవు. నేను అనే మొదటి తలంపును విచారణ చేయగలిగితే విచారణ చెయ్యి జ్ఞానమార్గంలో ప్రయాణించి ఈ నేనును పోగొట్టుకొనే శక్తి నీకు లేకపోతే భగవంతునికి శరణాగతి చెందు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని నీకు విశ్వాసం ఉంటే శరణాగతిమార్గంలో ప్రయాణం చెయ్యి. ఒకోసారి మీకు ఏదో కష్టంవచ్చినట్లు అనిపిస్తుంది. భగవంతుడు ఆ కష్టాన్ని కష్టంలాగ ఉంచడు. ఏదో ఒక మంచికోసం మిమ్మల్ని త్రిప్పటానికి ఆకష్టాన్ని ఇచ్చాడు అని గ్రహిస్తే మీరు ధన్యులు. బాహ్యానికి మీకు ఏదైతే కష్టంలాగ కనిపిస్తోందో ఆకష్టం మీకు సుఖంగా, శాంతిగా మారిపోతుంది. అది మీరు గ్రహించాలి. అనుకొనేది మనసంకల్పం, జరిగేది ఈశ్వర సంకల్పం. ఈశ్వర ప్రణాళికను అర్థం చేసుకోవాలి. ఈశ్వర ప్రణాళిక మీ బ్రెయిన్‌కు అర్థమయితే శరణాగతి వేగమవుతుంది. ఈశ్వర సంకల్పాన్ని నీసంకల్పంగా చేసుకొని ఈశ్వరుని ఇష్టాన్ని నీఇష్టంగా చేసుకొంటే అదే నిజమైన నమస్కారము. ఈశ్వరుని సంకల్పాన్ని మనం ఇష్టం చేసుకోకపోయినా జరిగేది ఈశ్వరుని సంకల్పమే. జరిగేది అంతా ఈశ్వరుని సంకల్పంతో జరుగుతోంది అని మనకు తెలియటంలేదు. అది తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు భగవాన్. మనకు తెలిసినా జరిగేది అదే. మనకు తెలియకపోయినా జరిగేది అదే. అది మనకు తెలియకపోవటం వలన దుఃఖం వస్తోంది. జరిగేది అంతా ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతోంది అని మనకు అర్థమయితే మనకు ఎంత దుఃఖం ఉన్నా సుఖంగా మారిపోతుంది. అంతా ఈశ్వర సంకల్పంతోనే జరుగుతోంది అని భగవాన్ చెప్పారు. మనము చెప్పకొంటున్నాము. కాని ఆయనకు మనకు తేడా ఏమిటి అంటే ఆయన చెప్పిన మాట ఆయనకు అనుభవంలో ఉంది. అందువలన అక్కడ దుఃఖం ఆరిపోయింది. మనం ఆ మాటను నోటితో చెపుతున్నాము. అనుభవంలో లేదు. ఆ మాట మనకు కూడా అనుభవంలోనికి వస్తే మనం కూడా ఋషి అవుతాము.

సంకల్పాన్ని విడిచిపెట్టు సంకల్పంలేకపోతే యోగివి అవుతావు అని కృష్ణుడు చెప్పాడు. సంకల్పం లేకపోతే రోజులు ఎలా వెళతాయి అని ఒకరు భగవాన్‌ను అడిగారు. కనీసం మంచినీళ్ళు త్రాగాలన్నా నీళ్ళు త్రాగాలి అనే తలంపు వచ్చాక కదా నీళ్ళు త్రాగుతున్నాము. ఎక్కడికైనా వెళ్ళేటప్పుడు కూడా వెళ్ళాలి అనే తలంపు వచ్చాక కదా ఈశవం అక్కడికి వెళుతుంది. మరి సంకల్పం లేకపోతే రోజులు ఎలా వెళతాయి అని ప్రశ్న. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే కృష్ణుడు ఉద్దేశ్యం అదికాదు. సంకల్పం విడిచిపెట్టు అంటే సొంతం చేసుకొనే ప్రయత్నం చేయకు అని అర్థం. ప్రపంచంలో అనేక వస్తువులు ఉంటాయి. వాటిని నీవు వాడుకోవచ్చుకాని వాటిని సొంతం చేసుకొనే ప్రయత్నం చేయవద్దు. వాటిని సొంతం చేసుకొనే ప్రయత్నమే సంకల్పం. దానిని విడిచిపెట్టమని భగవంతుడు చెప్పాడు అన్నారు భగవాన్.

దైనందిన జీవితంలో మంచి, చెడు ఏది వచ్చినా ఏది జరిగినా, ఎలా జరిగినా ఇది అంతా ఈశ్వరానుగ్రహమే అని ఎవడైతే సంతృప్తి పడతాడో వాడు శరణాగతి చెందినట్లు లెక్క. జరిగేది అంతా ఈశ్వర సంకల్పంతోనే జరుగుతోంది అనే భావన నూటికి నూరుపాళ్ళు నీకు కలగాలి. లేకపోతే నీ శరణాగతి నిజంకాదు. మొదట పాక్షిక శరణాగతి వస్తుంది. అభ్యాసం చేయగాచేయగా పూర్ణ శరణాగతి వస్తుంది. పూర్ణశరణాగతే నిజమైన ప్రార్థన. నేను తెలివైన వాడిని అని నీవు అనుకొంటూ ఉంటే నీలోపల ఉండి నేను తెలివైన వాడిని అని ఎవడైతే అంటున్నాడో వాడిని పట్టుకో. విచారణామార్గంలో ప్రయాణం చెయ్యి. భగవంతుడు ఉన్నాడు. అంతా ఆయన సంకల్పంతో జరుగుతోంది. భగవంతుని శక్తి ముందు నా శక్తి ఏపాటిది అనే భావన ఉంటే శరణాగతి మార్గంలో ప్రయాణం చెయ్యి. నీవు ఏదైతే నేను, నేను అనుకొంటున్నావో అది ఎందుకు పనికిరాదు అని నీకు స్ఫురించినపుడు నీకు శరణాగతి వస్తుంది. అది ఏదో నన్ను ఉద్ధరిస్తుంది అని నీవు అనుకొంటూ ఉంటే నీకు శరణాగతి ఎలా కుదురుతుంది.

జ్ఞానం అంటే ఈశ్వరుడే. జ్ఞానం అంటే భగవంతుడే. జ్ఞానంవేరు, భగవంతుడు వేరుకాదు. భగవంతునికి మరో పేరే జ్ఞానం. నీ హృదయంలో ఉన్న భగవంతుని గ్రహిస్తే నీకు జ్ఞానం కలుగుతుంది. ఆయన జ్ఞానం ఒక్కటే. ఇద్దరూ వేరు అనుకొంటే మనకు సరియైన అవగాహన లేదు అని అర్థం. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా నీ హృదయంలోనికి వెళ్ళి ఐక్యం కావాలి. నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణించు. జరగవలసినది నీ హృదయంలోనికి వెళ్ళి నువ్వు కలవాలి. శరణాగతి వచ్చింది అని నోటితో చెపితే సరిపోదు. మాటలవలన దేవుడు మోసపోడు. నీ హృదయంలోనికి ప్రయాణం చెయ్యి. నీ మనస్సులో ఉన్న లోపములను తీసివెయ్యి. ఏదో మార్గంలో నీవు పరమ పవిత్రుడవు అవ్వాలి. నీ జీవితంలో శాంతిని, ఏకాగ్రతను సంపాదించు. మిగిలినవి అన్నీ స్వప్న సమానమే. నీలో పవిత్రత లేకపోతే ప్రతి చిన్న విషయానికి సందేహిస్తావు. నీవు ఏకాగ్రతను, శాంతిని సంపాదించి వాటి సహాయంతో నీవు పవిత్రుడవు కావాలి. పవిత్రుడవు అయితే నీస్వరూపమును పొందుతావు. చైతన్యస్థాయిని అందుకొంటావు. సందేహించవద్దు. ఇప్పుడు మనం ఏమనుకొంటున్నాము అంటే మనం ఉన్నాము, దేవుడు ఉన్నాడు అనుకొంటున్నాము. కాని శరణాగతి పొందినవాడు నేను లేను, ఉన్నది నీవే అంటాడు. అదే నిజమైన శరణాగతి అది శరణాగతి మాత్రమేకాదు అదే జ్ఞానం.

ఈ సృష్టి లేనప్పుడు కూడా, పంచభూతములు లేనప్పుడు కూడా, జీవకోటి లేనప్పుడు కూడా ఏదైతే ఉందో అదే నేను. అదే అహం. నేను ఉన్నాను అనుకోవటంలో పొరపాటు లేదు. నేను అలా ఉన్నాను, నేను ఇలా ఉన్నాను అనుకోవటంవలన కారం పెరిగిపోతూ ఉంటుంది. నేను అలా ఉన్నాను, ఇలా ఉన్నాను అనుకోకుండా ఉంటే కారం వెళ్ళి అహంలో కలిసిపోతుంది. అప్పుడు అహం నీకు వ్యక్తమవుతుంది. అది పరమస్థితి. ఒక ఆఫీసర్‌గారు ఉన్నారు అనుకోండి. నేను బాగా పనిచేస్తున్నాను అని ఆయన అనుకొన్నారు అనుకోండి. ఎవరైనా వచ్చి మీరు చేసేపని బాగోలేదు అంటే వెంటనే ఆయనకు దుఃఖం వచ్చేస్తుంది. నేను బాగా పని చేస్తున్నాను అని ఆయన అనుకోకపోతే మనం ఏదైనా అన్నా ఆయనకు దుఃఖం రాదు. ఇలా అనుకోవటం వలననే మనుషులు ప్రమాదంలో పడుతున్నారు.

మననం కంటే శ్రవణం గొప్పది. అలాగని మననం చెయ్యకూడదు అనికాదు. మననం వలన ప్రమాదం వస్తోంది. మీరు ఏమాటను అయితే శ్రవణం చేస్తారో ఆమాటకు ఇంటిలో గొడవలు కలపకుండా దాని అర్థమును మననం చేస్తూ ఉంటే మీరు జ్ఞానులు అవుతారు. అలా కాకుండా మీరు విన్న విషయానికి ఇంట్లో గొడవలు, సంసార గొడవలు కలిపితే అది మననం ఎలా అవుతుంది. దీని వలన చివరకు చెమట మిగులుతుంది, ఫలితం సున్నా. ధనవంతుడు సుఖంగా లేడు, పండితుడు సుఖంగా లేడు, అధికారం ఉన్నవాడు సుఖంగా లేడు. ఎవరూ సుఖంగా లేరు కారణం ఏమిటి? అంటే మనం నిజస్థితిలో లేము. మనం నిజస్థితిని పొందేవరకూ ఏదో రూపంలో దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. ఇప్పుడు మనం ఉన్న స్థితి నిజమైన స్థితికాదు. అందువలన దుఃఖం వస్తోంది. మనం ఉన్న స్థితి నిజమైన స్థితి అయితే దుఃఖం రాదు. మనిషికి దుఃఖం ఎందుకు వస్తోంది. అంటే కర్తృత్వం వలన దుఃఖం వస్తోంది. కర్తృత్వము అహంకారంలో ఉంది. అందువలన అహంకారం ఉన్నంతసేపు నీకు దుఃఖం వస్తుంది. నీ హృదయంలో ఉన్న చైతన్యమును అనుభవంలోనికి తెచ్చుకొంటే చైతన్యములో కర్తృత్వము లేదు అందువలన దుఃఖం నశిస్తుంది.

ఇప్పుడు మీమనస్సులో ఏమి ఉన్నాయి. మీ సంకల్పాలు ఉన్నాయి. మీసంకల్పాలు మీ మనస్సులో ఎలా ఉన్నాయో అలాగ దేవుని సంకల్పాలు మీ మనస్సులో ఉంటే అప్పుడు మనస్సు అణిగిపోతుంది. మీ మనస్సు రాలిపోతుంది. అప్పుడు జ్ఞానం కలుగుతుంది. నా అహంకారమే అంతా చేస్తోంది అని నీవు అనుకొంటూ ఉంటే నీ మొఖం ఈశ్వరుని వైపు తిరగదు. నీ అహంకారములో ఉన్న నీచత్వం, నీఅహంకారములో ఉన్న అల్పత్వం నీవు గుర్తించినపుడు మాత్రమే ఈశ్వరునివైపు నీమొఖం తిరుగుతుందిగాని అహంకారములో ఉన్న అల్పత్వం, నీచత్వం నీకు తెలియనంతకాలం నీ మొఖం ఈశ్వరుని వైపు తిరగదు. నీదేహం యొక్క గొడవలు, సంసారం యొక్క గొడవలు మొత్తం నీ గొడవలు అన్నీ ఒక ప్రక్కనపెట్టి ఈశ్వరుడు ఏదిచెపితే దానిని స్వీకరించు. మనకు జ్ఞానం కలగకుండా ఎవరో ఇతరులు మనకు అడ్డురావటంలేదు. ఎవరో బయటవారు అడ్డువస్తున్నారు అని మనకు అనిపిస్తోంది. ఇతరులు ఎవరూ అడ్డు రావటంలేదు. మన అహంకారమే మనకు జ్ఞానం కలగకుండా అడ్డు వస్తోంది అని మనకు తెలియటంలేదు. కనీసం ఇది తెలుసుకోవటానికి కొన్ని వందలు జన్మలు పడుతుందేమో. మనం చేతితో చేసే పనిలో, నోటితో మాట్లాడే మాటలో అహంకారం కలగజేసుకోకుండా చూసుకొంటే అహంకారం నెమ్మదిగా పల్చబడుతుంది.